


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు (డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

"నువ్వు నిన్నూ, నీ కుటుంబాన్నీ, నీ మనస్తత్వాన్నీ దృష్టిలో ఉంచుకుని ఆలోచిస్తున్నావు. కానీ మన పౌరుల్లో కోటానుకోట్లు తిండికి గతిలేక అలమటిస్తున్నారు. వాళ్లని దృష్టిలో ఉంచుకుంటే – ఇలా ఆలోచించలేవు" అన్నాడు ఓంప్రకాష్.

అప్పుడు గోపాలకృష్ణన్ నోరు విప్పాడు, "ఒక విషయం మాత్రం నిజం. మా నాన్న చిన్నప్పట్నించీ నన్ను ప్రతిదానికీ అదుపు చేసేవాడు. నేను నోరు విప్పితే చాలు – అదే ఎదిరించడమని చెప్పి, నామీద చెయ్యి చేసుకునేవాడు. అలా పెరిగిన నాకు ఇప్పుడు నలుగురిలో మసలడం ఎంతో ఇబ్బందిగా ఉంటోంది. నేనిలా ఉండడానికి కారణం పెంపకం లోపమేనని నా అభిప్రాయం" అన్నాడతను.

"ఉత్తపుణ్యాన తండ్రి చెయ్యి చేసుకుంటే తిరగబడే ధైర్యం నీకు లేకపోయింది. అందుకు కారణం నీకాయనపై ఉన్న గౌరవం కాదు. ఆయన సమకూర్చుతున్న సౌకర్యాలు నీకు కావాలి. నీకు నీవుగా వాటిని సమకూర్చుకోలేనని నీకు తెలుసు. అందుకే నువ్వాయన ప్రవర్తన సహించావు. ఫలితంగా కెమిస్ట్రీలో డాక్టరేట్ చేశావు. ప్రతిష్ఠాత్మకమైన వాన్ హుంబోల్డ్ట్ ఫెలోషిప్ సాధించావు. జీవితానికి పూలబాట పర్చుకున్నావు. నీ తండ్రి నీకన్యాయం చేశాడంటే నేనొప్పుకోను. అన్యాయమంటూ జరిగితే అది నీకు నువ్వే చేసుకున్నావు" అన్నాను.

"ఇప్పటికీ మనం వ్యక్తిగత సమస్యలే చర్చిస్తున్నాం. కోటానుకోట్ల అభాగ్యుల సమస్యలకి పరిష్కారం చెప్పడం లేదు" అన్నాడు దాస్ సంభాషణ దారి మళ్లిస్తూ.

"నేను స్వేచ్ఛను కాంక్షిస్తాను. కానీ ఒక భారతపౌరుడిగా నాకా అర్హత ఉందనిపించదు. వ్యవస్థల మంచి చెడ్డలను పక్కన పెడదాం. సగటు భారతపౌరుడికి కనీసం కూడూ, గుడ్డా, నీడా దొరికేదాకానైనా – దేశపౌరులంతా ఎటువంటి త్యాగాన్నైనా చెయ్యాలి – చివరికి స్వేచ్ఛను కూడా....." అన్నాను కాస్త ఆవేశంగా.

ఓంప్రకాష్ నా భుజం తట్టి, "సెబాస్! నా అభిప్రాయం కూడా అదే! మనం కాపిటలిజాన్ని వదిలి కమ్యూనిజాన్ని ఆశ్రయించాలి. చైనాని ఆదర్శంగా తీసుకోవాలి" అన్నాడు.

నేను తల అడ్డంగా ఊపి, "నిజాన్ని దాచనంతవరకూ ఏ ఇజమైనా మంచిదే. కానీ చైనాలో ఇజం నిజాన్ని దాచి పెడుతుంది. అక్కడేం జరుగుతోందో బయటి ప్రపంచానికి తెలియదు. మా దేశంలో పేదరికం లేదని వారంటారు. మనం నమ్మాలి. అలాంటి ఇజాల్లో పాలకులు క్రూరంగా మారే అవకాశముంది" అన్నాను.

"మరేం చెయ్యాలంటావ్?" అన్నాడు దాస్.

"ఏంచెయ్యాలో అందరికీ తెలుసు. కానీ ఎవ్వరూ చెయ్యరు. నిజం చెప్పాలంటే భారత దేశంవంటి పేద దేశానికి దివ్యభవనాలవసరమా? పౌరులకి ఖరీదైన కార్లు అవసరమా? కళ్లు జిగేల్మనే షోకులవసరమా? విలాస జీవనం కోసం విరివిగా రెస్టారెంట్లు, బార్లు అవసరమా? ఇలాంటి వాటికోసం మన దేశం విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని వృథా చేస్తోంది. దేశమంతటా సింప్లిసిటీని పాటించడానికి కమ్యూనిజం తప్ప వేరు మార్గం లేదా? లేదనుకుంటే కమ్యూనిజాన్నే ఆహ్వానించాలి తప్ప ఈ పరిస్థితి కొనసాగనివ్వకూడదు. కానీ సామాన్యులకి కూడా ఎయిర్ కండిషన్డు గదులు కావాలి. టెర్లిన్ దుస్తులు కావాలి. విలాస జీవితం కావాలి. చుట్టూ ఉండే అభాగ్యుల్ని చూసినా వారి కోరికలు వెనక్కి తగ్గవు. ప్రభుత్వం కూడా వారిని ప్రోత్సహిస్తుంది. ఇతరత్రా ఎన్నో శాసనాలు చేస్తూ – ఈ విషయం మాత్రం పట్టించుకోదు" అన్నాను.

"ఏదో రోజున విప్లవం వస్తుంది. ప్రజలు తిరగబడతారు" అన్నాడు దాస్.

"శతాబ్దాల భారతచరిత్రను గమనిస్తే – దండయాత్రలే తప్ప విప్లవాలు కానరావు" అన్నాను.

నా మాటల్ని నిజం చెయ్యడానికా అన్నట్లు ఆ టాపిక్ అంతటితో ఆగిపోయింది.

కడుపు నిండినవాళ్లు కడుపు మండుతున్నవాళ్ల గురించి ఎంతసేపని ఆలోచిస్తారు? మళ్లీ ఆ హాస్టల్లో అలాంటి చర్చ జరిగిన గుర్తు లేదు నాకు.

సత్రం భోజనం, మఠం నిద్ర. మర్నాడు హాస్టల్లో నాకు ఒకరింట్లో బ్రేక్‌ఫాస్ట్. ఒకరింట్లో లంచ్. ఒకరింట్లో ఈవెనింగ్ స్నాక్స్. ఒకరింట్లో డిన్నర్. అంతా నా కోసం ప్రత్యేకంగా శాకాహారం తయారు చేశారు.

ఆ సందర్భంగా జర్మనీలో తటస్థపడ్డ రకరకాల వ్యక్తుల గురించి మాట్లాడుకుంటుండగా – మా ఇంటామె ఒలోముచ్‌కీ ప్రసక్తి వచ్చింది.

ఆమె సెక్స్ కీనోలో టికెట్స్ అమ్ముతుంది.

కీనో అంటే మూవీ థియేటర్ అనుకోవచ్చు. బెర్లిన్లో వీధివీధికీ సెక్స్ కీనోలున్నాయి. వాటిలో నాన్‌స్టాప్‌గా పోర్న్ సినిమాలు చూపిస్తారు.

ఒలోముచ్‌కీది ఊబకాయం. వయసు అరవైకి తక్కువుండదు. ఆయాసపడుతూ నడుస్తుంది. ఇంటిమెట్లెక్కడానికీ, దిగడానికీ నేలమీద చతికిలబడి – చేతుల సాయంతో ముందుకు వెడుతుంది.

డ్యూటీకి బయల్దేరేముందు ఆమె టాక్సీకి ఫోన్ చేస్తుంది. మెట్లు దిగేసరికి టాక్సీ సిద్ధంగా ఉంటుంది. ఇంటికి కూడా టాక్సీలోనే వస్తుంది. ఉదయానికి ఏవో వండుకుంటుంది. మధ్యాహ్నం, రాత్రి బయటే భోజనం. వంటకు వాడిన సామగ్రిని ఆమె శుభ్రం చెయ్యదు. ఒక ప్లాస్టిక్ టబ్బులో పెడుతుంది. ఆమె వద్ద పాత్ర సామగ్రి చాలా ఉంది. రెండు మూడు వారాలు పాత్ర సామగ్రి పేరుకుపోయేక ఓ పనిమనిషికి ఫోన్ చేస్తుంది. ఆ పనిమనిషి కార్లో వచ్చి మొత్తం పాత్రలన్నీ శుభ్రం చేసి వెళ్లిపోతుంది. అందుకు గంటకి పాతిక మార్కుల చొప్పున తీసుకుంటుంది.

ఒలోముచ్‌కీ రోజూ ఉదయం తొమ్మిదికి బయల్దేరి వెళ్లి రాత్రి పదికి తిరిగొస్తుంది. ఆదివారాలు కూడా సెలవు తీసుకోదు. నేనొచ్చేక అంతవరకూ ఆమె పూర్తిగా ఇంట్లో ఉన్నది ఒక్క డిసెంబర్ 24న. ఆ రోజు క్రైస్తవులకు పవిత్ర దినం. ఊళ్లో ఏ షాపులూ ఉండవు. సెక్స్ కీనోలు కూడా ఉండవు. ఊరెడు జనం ఇంట్లో మాత్రమే గడిపే ఒకే ఒక్క రోజది.

డిసెంబర్ 24న ఒలోముచ్‌కీ నన్ను తన గదికి ఆహ్వానించింది – వైన్ తాగడానికి. నాకు వైన్ అలవాటు లేదనీ, ఐనా ఆహ్వానంమీద వేరే చోటకి వెడుతున్నాననీ చెప్పి ఆ ఆహ్వానాన్ని మృదువుగా నిరాకరించాను.

ఆమెకు వేరే ఎవ్వరూ లేరు. ఆ వయసులో, కదలడం కష్టమైన ఊబకాయంతో, ఆదివారాలు కూడా సెలవు తీసుకోకుండా పనిచేసి డబ్బు సంపాదించాలనుకునే ఆమె తత్వం నాకు అర్థం కాలేదు. ఆపైన సాధారణంగా యూరోపియన్సుకి ఉండే శుభ్రత ఆమెలో లోపించడం ఆశ్చర్యంగా ఉండేది.

నేనుండే ఇల్లు ఆమె స్వంతం కాదు. తను అద్దెకు తీసుకున్న ఇంట్లో ఓ గది నాకు అద్దెకిచ్చింది. నేనుండే భాగం కాక ఇంకా మూడు గదులున్నాయా ఇంట్లో. తను డబ్బెందుకు సంపాదిస్తుందో, సంపాదించి ఏం చెయ్యాలనుకుంటోందో నాకు అర్థం కాదు.

ఆమెకు ముగ్గురు భర్తలు చనిపోయారు. పిల్లలు లేరు. ఒక అన్న మాత్రం బెర్లిన్లోనే దూరంగా వేరేచోట ఉన్నాడు. డిసెంబర్ 24న వాళ్లిద్దరూ కలుసుకుని చర్చికి వెడతారుట.

"ఆ మనిషికి డబ్బు కాపీనం. అందుకే నీకు బెర్లిన్లో ఇల్లు దొరికింది" అన్నాడు ఓంప్రకాష్.

"ఔను. ఇల్లిచ్చినందుకు నాకామె దేవతలా కనబడుతుంది" అన్నాను.

"మరి నేనెలా కనబడుతున్నాను?" అన్నాడు నాని.

"వరాలిచ్చేవారు దేవతలు. కష్టాల్లో ఆదుకునేవాళ్లు అవతార పురుషులు. నువ్వు అవతారపురుషుడివి" అన్నాను.

నానిని నేను అవతారపురుషుడిగా గుర్తించినా, నా కష్టాలు మాత్రం ఇంకా కొనసాగుతున్నాయి.

నాని ఏరోఫ్లోట్ ఆఫీసులో వివరాలడిగి తెలుసుకున్నప్పుడు తెలిసింది. అతను విమానాశ్రయానికి వెళ్లడానికి ఇబ్బంది లేదు కానీ....

ఏరోఫ్లోట్ విమాన యాత్రీకులకోసం ఈస్ట్ బెర్లిన్ వెస్ట్ బెర్లిన్ల మధ్య బస్సొకటి నడుస్తోంది. ఆ బస్సు వెస్ట్ బెర్లిన్లో బయల్దేరుతుంది. ఏరోఫ్లోట్ విమానం ఎక్కాల్సిన ప్రయాణీకుల్ని ఈస్ట్ బెర్లిన్ విమానాశ్రయం చేరుస్తుంది. విదేశాలనుంచి ఈస్ట్ బెర్లిన్ వచ్చినవారిని వెస్ట్ బెర్లిన్ చేరుస్తుంది. అది నిర్ణయించబడ్డ కొన్ని స్టాప్స్‌లో మాత్రమే ఆగుతుంది. ఆ స్టాప్స్‌లో నాకు అనువైనది – రైజే బ్యూరో హెలియోస్. అక్కడికి చేరడానికి నేను మూడు ఊబాన్లు (అండర్‌గ్రౌండ్ ట్రయిన్స్) మారాలి. అందుకు ఇరవై నిముషాలు పడుతుంది.

అసలు సమస్య అది కాదు. బస్సులో విమాన ప్రయాణీకులు తప్ప ఇతరులెవ్వరూ ఎక్కకూడదు. శ్రీమతిని రిసీవ్ చేసుకుందుకు వెళ్లిన నాని కూడా ఆమెను బస్సు ఎక్కించగలడు కానీ, తను బస్సెక్కలేడు.

"ఔరా, కమ్యూనిస్టు దేశమా!" అనుకున్నాను.

"ఆ బస్సులో సీటు సంపాదించడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. కానీ మనం అన్నింటికీ సిద్ధపడి ఉండాలి" అన్నాడు నాని.

రోట్లో తల దూర్చాం. రోకటి పోట్లు తప్పవు మరి!

ఆలోచిస్తున్నాను. నాని నావాళ్లని బస్సెక్కిస్తాడు. నేను కళ్లలో వత్తులు వేసుకుని ఓ బస్‌స్టాపులో వాళ్లకోసం ఎదురుచూడాలి. ఆ ఎదురుచూపుల బాధకంటే, బస్సులో ఉన్న శ్రీమతి మానసికస్థితి గురించే నా తపన!

దేశం కాని దేశంలో విమానం దిగి, ముక్కూ మొహం తెలియని మనిషి సాయంతో బస్సెక్కి, గమ్యమెరుగని ప్రయాణం చెయ్యాలి.

మెదడు మొద్దు బారిపోయింది. రోజులు భారమైపోయాయి. నా పరిసరాల్లో మాత్రం ఉత్సాహం నిండిన వాతావరణం. వైభవం నిండిన సంబరాలు.

డిసెంబర్ 31 రాత్రి కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ చేసే వేడుకలు జర్మనీలో విశేషంగానే ఉండొచ్చు. కానీ నేను హాస్టలుకి వెళ్లలేదు. మనకంటూ మూడ్ లేనప్పుడు మంచి మూడ్‌లో ఉన్నవారి మధ్య ఉండడం వారికీ మనకీ ఇబ్బందే మరి!

రోజంతా ఒక్కణ్ణీ ఒంటరిగా గడిపాను. రాత్రి తెల్లవార్లూ ఊరంతా పటాసుల సందడిలో కలత నిద్రపోయాను.

మర్నాడు కొత్త సంవత్సరం 1975. రేడియోలో క్రికెట్ కోసం బిబిసి స్పోర్ట్స్ న్యూస్ వింటే – ఇండియా వెస్టిండీస్‌ని ఓడించిన విషయం తెలిసింది. అప్పటికి మొదటి రెండు టెస్టులూ వెస్టిండీస్ నెగ్గి ఉండడంతో – ఈ వార్తకోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను. కొత్త సంవత్సరం శుభారంభం అనుకున్నాను ఓ క్రికెట్ అభిమానిగా.

ఎందుకో మనసులో బెంగ కొంత తగ్గింది.

మర్నాడు ఆఫీసుకెళ్లి ఉత్తరాలు చూడాలి. ఇంటిదగ్గర ప్రోగ్రెస్ తెలుస్తుంది.

అంతలోనే మళ్లీ బెంగ – శ్రీమతి ప్రయాణం మానుకుంటే.....?

అప్పుడు నాలో వివేకం పైకి లేచింది, "ఏయ్, మనసూ! నువ్వు మనవాణ్ణి బతకనిచ్చేలా లేవు. కాస్త పక్కకి తప్పుకో. నేను టేకోవర్ చేస్తాను" అంది.

"నేను వాస్తవం చెబుతున్నాను. బతుకుకంటే మనిషికి వాస్తవం ముఖ్యం" అంది మనసు నన్ను వదలడానికి ఇష్టపడక.

"ఏమిటి వాస్తవం? వాళ్లు రారేమోననా? రాకపోతే మిన్ను విరిగి మీద పడుతుందా? భూకంపాలొస్తాయా? అగ్నిపర్వతాలు బద్దలౌతాయా? ఏమీ జరుగదు. ప్రమాదమంటే గజేంద్రుడిది. అతడికి – లావొక్కింతయు లేదు. ధైర్యము విలోలంబయ్యె. ప్రాణంబులా ఠావుల్దప్పెను. మూర్ఛ వచ్చె. తనువుం డస్సె. శ్రమంబయ్యె"

"ఐతే?" అంది మనసు.

"అప్పుడు గజేంద్రుడేం చేశాడు? రావే ఈశ్వర, కావవే వరద, సంరక్షింపు భద్రాత్మకా – అని దేవుణ్ణి ప్రార్థించాడు. దేవుడొచ్చాడు. రక్షించాడు" అంది వివేకం.

"ప్రార్థించడానికి ముందు దేవుడిమీద నమ్మకముండాలి కదా!" అంది మనసు.

"గజేంద్రుడికి మాత్రం నమ్మకముందా – 'కలడు కలండనెడివాడు కలడో లేడో' అనుకుంటూనే దేవుణ్ణి ప్రార్థించాడు. అపనమ్మకాన్ని పక్కన పెట్టి దేవుణ్ణి ప్రార్థిస్తే, ప్రార్థనలోంచి నమ్మకం పుడుతుంది. ఆ నమ్మకం బలాన్నిస్తుంది. దేవుణ్ణి నమ్మినవాడికి బెంగ ఉండదు. దిగులుండదు. కృషి తనవంతు, ఫలితం దైవనిర్ణయం అనుకోగల పరిణతి వస్తుంది"

నిజమే. భగవంతుడున్నాడు. ఆయన లాటరీలో ప్రైజ్ కావాలంటే ఇవ్వకపోవచ్చు. కానీ అడిగితే మనశ్శాంతిని ఇస్తాడు.

ఆయన నేను జర్మనీ రావాలనుకున్నాడు. వచ్చాను. నావాళ్లు నాతో కలిసి ఇక్కడ ఉండాలనుకుంటే ఉంటారు. అనుకోకపోతే ఉండరు.

నాకు దేవుడిపై నమ్మకం పుట్టింది. అది అవసరానికి చేసుకున్న ఏర్పాటు కాదు. వివేకం కలిగించిన స్పృహ. అంతే!

మనసు తేలికైపోయింది.

తపము ఫలించిన శుభవేళ

జనవరి రెండు.

కొన్నాళ్లుగా ఆలస్యంగా నిద్ర లేవడం అలవాటయింది. ఆ రోజు ఆఫీసుకెళ్లాలి కాబట్టి ఆరింటికల్లా అలారం పెట్టుకుని లేచిపోయాను. ఏడున్నరకల్లా తెమిలి ఎనిమిదికల్లా లేబరెటరీలో అడుగెట్టాను.

ఓ మూల గుండెల్లో గుబులుంది. కానీ సంతోషం దాన్ని మించే ఉంది.

ఆఫీసు చేరగానే, మనసు దారి మళ్లడానికి వర్కు మొదలెట్టాను.

మధ్యలో రాలెక్ వచ్చి కొత్త సంవత్సరానికి శుభాకాంక్షలు చెప్పి వెళ్లాడు. కొలీగ్సులో కిర్నర్ తప్ప ఇంకెవ్వరూ రాలేదు.

నా ధ్యాసంతా ఆఫీసుకొచ్చిన ఉత్తరాలమీదే ఉంది. టైమ్ తొమ్మిది దాటేక సెక్రటరీ ఆఫీసుకి వెడితే – రెండుత్తరాలిచ్చారు.

రెండూ శ్రీమతినుంచే. ఒకటి డిసెంబర్ 17న, రెండవది 23న వ్రాసింది. నేను వ్రాసిన ఉత్తరాలూ, ఇచ్చిన రెండు టెలిగ్రామ్సూ అందాయన్నది వాటిలో ముఖ్యాంశం.

అది తెలియగానే మనసు కాస్త తేలిక పడింది.

ఆఫీసులో ఉండగా మధ్యాహ్నం పోస్టులో మరో రెండుత్తరాలొచ్చాయి. అవి డిసెంబర్ 20, 28 తేదీలలో శ్రీమతి వ్రాసినవి.

నేను పంపిన టికెట్లు డిసెంబర్ 26న అందాయట. 26 అంటే రెండు పదమూళ్లు కాబట్టి అది నా లక్కీ నెంబరని సంతోషాన్ని ప్రకటించింది. అన్నయ్య మొదటి టెలిగ్రాంని అంతగా పట్టించుకోలేదనీ, రెండో టెలిగ్రాం చూడగానే హడావుడి పడ్డాడనీ తెలియగానే – మనసులోనే ఓంప్రకాష్‌కి ధన్యవాదాలు అర్పించుకున్నాను.

మొత్తంమీద నేను పంపిన టికెట్లు శ్రీమతికి సకాలంలో అందేశాయి. అందుకు నాలో చెప్పలేనంత ఉత్సాహం కలిగింది. ఆ రాత్రి వంటింట్లో మా పోస్ట్‌బాక్స్ అంటే రిఫ్రిజరేటరుమీద కాగితం వ్రాసి పెట్టాను – నావాళ్లు జనవరి 7కి బెర్లిన్ చేరుకుంటున్నారని.

ఆ రోజెంత ప్రయత్నించినా ఫోన్లో ఓంప్రకాష్ దొరకలేదు. మర్నాడు కూడా అతడు ఫోన్లో దొరక్కపోవడంతో ఉండబట్టలేకపోయాను.

ప్రస్తుతానికి అక్కడ ముఖ్యంగా ఈ వ్యవహారంలో నాకు ఆత్మీయుడతను. ఈ వార్తని అతనితో పంచుకోకుండా ఎలా?

నాకతని ఆఫీసు తెలుసు. నేరుగా అక్కడికెడితే – దొరికాడు. పరీక్ష వ్రాసేక శిష్యుడు గురువుకి విన్నవించుకున్న రీతిలో నేనతనికి వివరాలు చెప్పాను.

"గ్రేట్! అన్ని పనులూ ఐపోయిననట్లే, చాలా అదృష్టవంతుడివి" అన్నాడతను అభినందనగా.

"అలాగే అనిపిస్తోంది" అన్నాను.

"ఇప్పుడు నీకింకే దిగులూ లేదా?" అన్నాడతను.

"నేను దేవుణ్ణి నమ్మడం మొదలెట్టాను. నాకిప్పుడే దిగులూ లేదు" అన్నాను.

"గ్రేట్!" అన్నాడతను మళ్లీ.

ఆ రాత్రికి ఓంప్రకాష్ బలవంత పెట్టగా హాస్టలుకి వెళ్లి అతని గదిలోనే పడుకున్నాను.

మర్నాడు శనివారం. ఆఫీసుకి సెలవు. ఆ రోజు కూడా అక్కడే బద్ధకంగా గడిపేశాను.

హాస్టల్ మిత్రులు నాకోసం అటుకుల ఉప్మా చేశారు. నేను బాగుందని మెచ్చుకుంటే, "మేమిప్పుడు కొంచెంకొంచెంగా ఇచ్చేది ఎందుకనుకుంటున్నావ్! తర్వాత నీనుంచి దండిగా పుచ్చుకుందుకే" అన్నాడు ఓంప్రకాష్.

అప్పుడే నావాళ్లు వచ్చేసినట్లూ, మిత్రులకి ఆతిథ్యమిస్తున్నట్లూ – ఓ తీయని కల నాలో.

రాత్రి పదిన్నరకి నా గదికి చేరాను. ఇలా తలుపు తియ్యడమేమిటి – అలా వినిపించింది – "డాక్టర్ రావ్" అన్న ఒలోముచ్‌కీ పిలుపు.

అర్థమైంది. ఆమె నాకోసం ఎదురుచూస్తోంది. ఎందుకై ఉంటుంది?

తడబడుతూనే వెళ్లాను.

నా భయాందోళనల్ని తొలగిస్తూ, "నీ భార్యాబిడ్డలు వస్తున్నందుకు సంతోషం" అందామె.

నవ్వాను తేలికగా. ఆమె మళ్లీ, "నీ పిల్లల వయసెంత?" అనడిగింది. చెప్పాను.

"అల్లరి చెయ్యరు కదా!" అంది.

చేస్తే మాత్రం – నా పిల్లల అల్లరి నాకు అల్లరి అనిపిస్తుందా? అనిపించినా నేనామెకి ఆ విషయం చెబుతానా? చాలా తెలివితక్కువ ప్రశ్న – అనుకుని – "చెయ్యరు" అని బదులిచ్చాను.

"అపరిశుభ్రతను సహించలేను. మీవాళ్ల కారణంగా వంటిల్లు అపరిశుభ్రంగా ఉండకూడదు" అందామె.

అంటే వంటిల్లు అపరిశుభ్రంగా ఉండొచ్చు. కానీ అది మా కారణంగా కాకూడదు. ఒలోముచ్‌కీకి పరిశుభ్రత లేదు కాబట్టి వంటిల్లుని శుభ్రంగా ఉంచడం చాలా కష్టం. మా కారణంగా వంటిల్లు అపరిశుభ్రంగా ఉండకూడదని ఆమె అనడం బాగుంది.

"ఊఁ" అన్నాను.

"అద్దె కొంచెం పెంచగలవా?" అంది.

"స్కాలర్‌షిప్‌మీద ఉంటున్నాను. అద్దె పెంచడం నావల్లకాదు" అన్నాను.

"ఊరికే అడిగాను. ఏమీ అనుకోకు" అందామె.

"అయ్యో! అనుకోవడానికేముంది? ఇల్లిచ్చావు. అందుకు నీకు ధన్యవాదాలు" అన్నాను.

ఆమె ఓ క్షణమాగి, "నీవాళ్లొస్తున్నారు కాబట్టి, ఈ నెలకి ఇంకో యాభై మార్కులు ఇవ్వాలి. ఆ అదనపు సొమ్ము ఎప్పుడిస్తావ్?" అంది.

"వచ్చే సోమవారం. అనగా ఎల్లుండి రాత్రి" అన్నాను.

"ఒకే. మరో విషయం. ప్రతి నెలా అద్దె పదిహేను రోజులు ముందుగా ఇవ్వగలవా? అంటే ఫిబ్రవరి నెల అద్దె ఈ నెల పదిహేనుకే ఇవ్వాలి" అందామె.

"ఇస్తాను కానీ – ఉన్న డబ్బంతా టికెట్టుకి ఐపోయింది. ఈ నెలకి ఇంకేమివ్వలేను. వచ్చే నెలనుంచి నువ్వు చెప్పినట్లే చేస్తాను" అన్నాను.

"సరే" అంది కానీ ఆమె మొహం అదోలా ఐపోయింది.

నా మాట నచ్చలేదా అనుకున్నాను కానీ, ఆమె వెంటనే, "నా సోదరుడి ఆరోగ్యం బాగోలేదు. నాకీ ప్రపంచంలో మిగిలిన బంధువు అతనొక్కడే. ఏ క్షణంలో అతని గురించి ఏ వార్త వినాలోనని బెంగ పడుతుంటాను. అలాంటి సమయంలో ఈ టెలిగ్రాం వచ్చింది. ఎంత గాభరా వేసిందో నాకు. కానీ ఈ టెలిగ్రాం నాకు కాదు, నీకు" అంటూ ఓ కాగితం నాకు అందించింది.

అన్నీ సక్రమంగా జరిగితే టెలిగ్రాం ఇవ్వమని అన్నయ్యకి వ్రాశాను. ఇప్పుడు టెలిగ్రాం వచ్చింది.

ఆత్రుతగా అందుకుని చదివాను. "ఆల్ ఓకే. మీట్ బెర్లిన్ సెవెన్".

అప్రయత్నంగా, "డాంకే" అన్నాను. నిజానికా థాంక్స్ అన్నయ్యకి!

అది తనకే చెప్పాననుకుని ఒలోముచ్‌కీ "బిట్టే" అని ఇట్టే లోపలకి వెళ్లిపోయింది. నా థాంక్స్ అన్నయ్యకెలాగూ వినిపించవు కాబట్టి ఎవరిని చేరితేనేం అనుకుని తృప్తి పడ్డాను.

మహోత్సాహంగా నా గదిలోకెళ్లాను. మనసు తేలికైపోతే కళ్లు కూడా తేలికైనట్లున్నాయి, ఓ పట్టాన నిద్ర పట్టలేదు.

నావాళ్లనిక్కడికి రప్పించే ఘట్టం సుఖాంతమైనట్లే ఉంది.

కావడానికి క్షణమొక యుగమైనా – రోజులు పరుగెడుతూనే ఉన్నాయి.

జనవరి ఏడున ఉదయం నానిని కలుసుకున్నాను.

"నేను బస్సెక్కడానికి వీల్లేదుట. నువ్వు మీవాళ్లని రెయిజేబ్యూరో హెలియాస్ దగ్గర రిసీవ్ చేసుకోవాలి. ఆ బస్సుకి అదే ఆఖరి స్టాప్ కాబట్టి – ఏ ఇబ్బందీ ఉండదు" అన్నాడు నాని.

అప్పటికి నాకు నాలుగు ఉత్తరాలు వ్రాసింది శ్రీమతి. అన్నింట్లోనూ కూడా, "ఎయిర్‌పోర్టుకి మీరు రావాలి. అక్కడ మీ రాక కోసం ఎదురు చూస్తుంటాను" అన్న వాక్యం కామన్.

ఆమెది చాలా చిన్న కోరిక. కానీ ఇంచుమించు అసాధ్యం.

ఇప్పుడు ఎయిర్‌పోర్టులో నా బదులు నాని కనబడతాడు. ఏమనుకుంటుందామె?

నాని నాకులాగే పొట్టిగా, బక్కగా ఉంటాడు. కానీ సినిమాలో ప్రొఫెసర్లకుండేలాంటి పిల్లి గెడ్డం ఉంటుంది. అనుమానం పుట్టాలి కానీ అతను కిడ్నాపర్‌లా అనిపిస్తే ఆశ్చర్యం లేదు.

నా బదులు అతను వెళ్లడం విషయం అటుంచితే – ఈస్ట్ బెర్లిన్‌నుంచి వెస్ట్ బెర్లిన్‌కి బస్సులో రావాలి తను. తెలిసినవాళ్లెవరూ తోడు లేకుండా....

ఏమైనా వ్యవహారమిక గంటల్లోకి వచ్చేసింది.

నేను నానికి మా ఫామిలీ ఫోటో ఇచ్చాను. శ్రీమతికి ఓ ఉత్తరం వ్రాసి అతని చేతికిచ్చాను. ఒకరినొకరు గుర్తించడానికీ, అనుమాన నివృత్తికీ – ఆ రెండూ అవసరమని నాకు తోచింది.

సాయంత్రం నాలుగయ్యేసరికల్లా రెయిజోబ్యూరో హెలియాస్ దగ్గర హాజరయ్యాను.

రెయిజోబ్యూరో అంటే ట్రావెల్ ఏజన్సీ కార్యాలయాలు. సాధారణంగా అవి బిజీగా ఉంటాయి. నేను వెళ్లిన ఆఫీసు దగ్గర ఏయే వేళల్లో బస్సులొస్తాయో టైంటేబుల్ ఉంది. ఆ ప్రకారం నా బస్సు 5.45కి రావాలి.

ఇంటి దగ్గర బయల్దేరినపుడు చలి లేదు. అందుకని ఓవర్‌కోటు లేకుండా వచ్చాను. టైం నాలుగయ్యేసరికి హఠాత్తుగా చలిగాలి మొదలైంది. ఆ వెంటనే సన్నగా చినుకులు.

నాకు వణుకు మొదలైంది. చేతులకి గ్లోవ్స్ లేవు. వంటిమీద ఓవర్‌కోటు లేదు.

"జర్మనీలో చలిని తేలికగా తీసుకోకు. ఏ క్షణంలోనైనా చలి ముంచుకు రావచ్చునని సిద్ధపడి ఉండాలి" అని ఓంప్రకాష్ నన్ను చాలామార్లు హెచ్చరించాడు. పట్టించుకోలేదు. ఫలితం ఈరోజు అనుభవిస్తున్నాను.

నావాళ్లకోసం ఎదురుచూపులవల్లనే కాదు, ఆ చలి వల్ల కూడా నాకు క్షణమొక యుగమైంది.

అయిదయ్యేలోగా ఈస్ట్ బెర్లిన్‌నుంచి రెండు బస్సులొచ్చాయి. వాటిలో నావాళ్లు లేరు. ఉండరని తెలుసు కానీ,అనుకున్నకంటే కాస్త ముందు వస్తే బాగుంటుందని ఆశ!

అప్పటికి చలికి తట్టుకోవడం కష్టమనిపించే పరిస్థితి వచ్చింది నాకు. రెయిజే బ్యూరో లోపలకు వెళ్లి కూర్చోవచ్చు కానీ అడగడానికి మొహమాటం వేసింది. అయిదింటికి ఆఫీసు మూసేస్తున్నప్పుడు అందులో పని చేసే అమ్మాయి నన్ను చూసి, "చాలా సేపట్నుంచి ఉన్నట్లున్నావ్? ఏం కావాలి?" అనడిగింది.

చెప్పాను. ఆమె నొచ్చుకుని, "అయ్యో! లోపలకొచ్చి కూర్చోవాల్సింది" అని జాలిపడి తలుపేసుకుని వెళ్లిపోయింది.

ఆమె డ్యూటీ ఆమె చేసింది. చలి డ్యూటీ చలి చేస్తోంది. అయిదున్నరకు మరో బస్సొచ్చింది. అందులోనూ నావాళ్లు లేరు.

"మరీ ఇంత పంక్చ్యుయాలిటీయా?" అని తిట్టుకున్నాను మనసులో. కానీ సరిగ్గా అయిదూ నలభైఐదుకి వచ్చిన బస్సులో మధ్య సీట్లో శ్రీమతి కనిపించింది. పక్కనే నా బంగారు తల్లి చిన్నారి రాజకుమారి కనిపించింది.

"ఆహా, జర్మన్ పంక్చ్యుయాలిటీకీ జై" అనుకున్నాను మనసులో.

నావాళ్లు జర్మనీలో...

కలో నిజమో తెలియలేదు. ఒక్క క్షణం నా మెదడు పని చెయ్యలేదు.

బెర్లిన్ మహానగరంలో నేను – నా ఎదురుగా ఓ బస్సు – ఆ బస్సులో నావాళ్లు –

డ్రైవర్ శ్రీమతికి చెబుతున్నాడు – బహుశా అదే ఆమె దిగాల్సిన స్టాపని కాబోలు.

శ్రీమతి నన్ను చూడలేదు. డ్రైవరుకి ఆమె చేస్తున్న సైగల్ని బట్టి నాకు అర్థమైంది – తను దిగాల్సిన స్టాప్ అది కాదని చెబుతోందని.

అందుకు కారణముంది. రెయిజో బ్యూరో హెలియాస్ ఆఖరి స్టాపని మేమనుకున్నాం కానీ అది నిజం కాదు. తను ఆఖరిస్టాపులో దిగాలని శ్రీమతి అనుకుంటోంది.

ఈ ప్రయాణంలో చివరి అడుగుదాకా ఆమెకి తప్పుడు సమాచారమే అందింది.

నేను డ్రైవర్ దగ్గరకి పరుగున వెళ్లి బస్సులో మావాళ్లున్నారని చెప్పాను. తర్వాత శ్రీమతి దగ్గరకు పరుగెత్తాను.

ఆమె నన్ను చూసింది. అప్పుడే నేను నా బంగారు తండ్రి చిట్టి శ్రీరామకమల్‌ని చూశాను.

పిల్లలిద్దరూ ఫుల్‌సూట్లు వేసుకుని మంకీకాప్సుతో ఉన్నారు. వాళ్లనలా చూడ్డం అదే ప్రథమం నాకు.

పిల్లల్ని, శ్రీమతిని మార్చి మార్చి చూస్తున్నాను.

ఒక పెద్ద సూట్‌కేసు. చిన్న హ్యాండ్‌బ్యాగు. అదీ శ్రీమతి సామాను.

ఆమె స్వెటర్ వేసుకుంది. షాల్ కప్పుకుంది.

నాకు మాట రావడం లేదు. ఆమె మాట్లాడ్డం లేదు.

అతి కష్టంమీద, "వసూ!" అన్నాను.

ఆమె మౌనంగా బస్సు దిగింది. సామాను కిందకి వచ్చింది.

అప్పుడు అమ్మాయి నన్ను గుర్తుపట్టి, "అమ్మా! నాన్నగారు" అంది.

అక్కని అనుకరించడంలో సిద్ధహస్తుడు అబ్బాయి. తనూ అదే మాటన్నాడు.

ఇద్దర్నీ దగ్గరగా లాక్కుని హత్తుకున్నాను. బస్సు వెళ్లిపోయింది.

"ప్రయాణం బాగా జరిగిందా?" అడిగాను శ్రీమతిని.

"ఊఁ" అందామె ముక్తసరిగా.

అమ్మాయి ముఖం నన్ను చూడగానే వెలిగిపోయింది. చిన్నప్పట్నించీ దానికి నా దగ్గర చేరిక ఎక్కువ. అది నా కాళ్లకి చుట్టుకుని ఉండిపోయింది.

ఊబాన్లో అయితే తొందరగా ఇల్లు చేరొచ్చు. చవగ్గానూ ఐపోతుంది. కానీ మానసికంగా, శారీరకంగా నేనందుకు సిద్ధపడి లేను. వెంటనే టాక్సీని పిలిచాను.

టాక్సీ ఇల్లు చేరేసరికి అక్కడ ఓంప్రకాష్ మాకోసం ఎదురు చూస్తున్నాడు. పరిచయాల పలకరింపులయ్యేక, సామాను పైకి చేరవెయ్యడంలో సాయం చేసి, కాసేపుండి వెళ్లిపోయాడతను.

నేను ఎయిర్‌పోర్టుకి రాలేదని శ్రీమతికి కోపమొచ్చింది. అది తాటాకు మంటని తెలిసినా చల్లార్చడం నా బాధ్యత, ఆమెకు పరిస్థితి వివరిస్తూనే షరతులు లేని క్షమార్పణ కోరాను.

ఆమె కొంత శాంతించి, "మీరు పంపిన నాని ఎంతో సాయం చేశాడు. అతను లేకపోతే ఏమైపోయేవాళ్లమో! ఐనా బస్సెక్కి ఒంటరిగా బెర్లిన్ రావడానికి ఎంత భయమేసిందో!" అంది శ్రీమతి.

"నేను మాత్రం భయపడలేదు. పూర్తిగా దేవుణ్ణి నమ్మాను" అన్నాను.

"నాకు తెలుసు. మీరు మాకోసం ఆ చలిలో గంటల తరబడి ఎదురు చూస్తుంటారని. కానీ కోపం. నాకు చాలా కోపం వచ్చింది...." అంది శ్రీమతి.

"థాంక్యూ వసూ! ఇన్నాళ్లుగా నేను మిస్సవుతున్నది ఈ కోపాన్నే! ఇంతకాలం నేనెదురు చూస్తున్నదీ కోపం కోసమే! నీ కోపం ఎంత తీవ్రంగా ఉండనీ – నాకు ఫరవాలేదు. నువ్వెదురుగా ఉంటే చాలు" అన్నాను.

"మీ కోరిక తీరుతుందని నమ్ముతున్నాను. ఎందుకంటే నేనూ దేవుణ్ణి నమ్ముతున్నాను" అంది శ్రీమతి.

"అయితే నువ్వూ శ్రీ వెంకటేశ్వరుడికి ఏమైనా మొక్కుకున్నావా?" అన్నాను.

"వెంకటేశ్వరుడెందుకు? మీరే నా దేవుడు" అంది శ్రీమతి. అలా అని వెంటనే వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

ఓదార్చాలనుకున్నాను. కానీ ఏడుపు నాకూ వస్తోంది.

మనసులో బాధ బయటకు పోవడానికి ఏడుపొక్కటే మార్గం. కాసేపు ఊరుకున్నాను.

ఆమె మనసులో బాధ పరిమాణమెంతో కానీ ఆమె చాలాసేపు వెక్కి వెక్కి ఏడుస్తూనే ఉంది.

ఇక ఆగలేక, "ఊరుకో వసూ! మనం కలుసుకున్నాంగా" అన్నాను.

"కలుసుకున్నాం. కానీ ఇకమీదట జీవితంలో మళ్లీ ఎప్పుడూ ఇలా కలుసుకోవాల్సిన అవసరం రాకూడదు. ఒకటి కాదు. రెండు కాదు. రోజులు కాదు. ఎనిమిది నెలలు... ఒకరికొకరు దూరంగా..." అని మళ్లీ ఏడ్చిందామె.

నేను కళ్లనీళ్లు తుడుచుకున్నాను.

ఆ బాధ మా ఇద్దరికే అర్థమౌతుంది. మాలా విడిపోయి కలుసుకున్న భారతీయ దంపతులకే అర్థమౌతుంది,

"బొందితో స్వర్గానికొచ్చాను. స్వర్గం స్వర్గంలా కనబడాలంటే, బొందితో కాదు, సతీసమేతంగా రావాలని ఇప్పుడు నాకర్థమైంది. ఇకమీదట ఇక్కడ నిజంగా స్వర్గాన్ని చూద్దాం" అన్నాను.

"మీరు లేక నేనింతకాలం నరకాన్ని చూశాను. ఇకముందు మనం స్వర్గాన్ని తప్ప ఇంకేమీ చూడొద్దు. ఇక్కడైనా, అక్కడైనా, ఎక్కడైనా కూడా" అందామె నా కౌగిలిలో ఒదిగిపోతూ.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments